వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492


www.prajaswecha.com
# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 25 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగస్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-

# సీఎంతో టీపీసీసీ చీఫ్ భేటీ

## తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ



**హైదరాబాద్- ప్రజా స్వేచ్ఛ**

సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. సోమవారం వీరిద్దరి మధ్య గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ పథకాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో పీసీసీ, పీఏసీ భేటీ ఉండే అవకాశం ఉండడంతో ఈ సమావేశంలో మెజారిటీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్టు సమాచారం.

**అరెస్టులు అక్రమం అప్రజాస్వామికం : మహేశ్ కుమార్ గౌడ్**

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీల అరెస్ట్ అక్రమం, అప్రజాస్వామిక చర్య అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఓట్ల చోరీపై ఆధారాలతో సహా నిరూపించి దేశ వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలను ప్రధాని మోడీ సర్కారు ఢిల్లీలో అరెస్ట్ చేయడాన్ని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సంఘాన్ని కలిసి ఓట్ల చోరీపై వినతి పత్రం ఇస్తామని శాంతి యుతంగా వెళ్తున్న ఎంపీలను అరెస్ట్ చేయడం అక్రమమనీ, అప్రజాస్వామ్యమని ఆయన అన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేసి ఓట్ చోరీ పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్
నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 25 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



## అణు బెదిరింపులకు భయపడం

- అమెరికా అండతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం పాక్‌కు అలవాటే..
- అణు బెదిరింపులపై తీవ్రంగా స్పందించిన భారత్

న్యూఢిల్లీ–

పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ .. భారత్‌కు అణు హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన.. తమది అణ్వాయుధ దేశమని, అవసరమైతే అణుయుద్ధానికి దిగుతామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగారు. తాము నాశనమైతే.. తమతోపాటు సగం ప్రపంచాన్ని తీసుకెళ్తామంటూ -మిగతా 3 లో




## ఏంపీలకు మరో కొత్త నివాస సముదాయం

- కొత్త సముదాయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,

ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఎంపీల నివాస సముదాయాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి మోడీ ఎంపీల ఫ్లాట్లు– ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇకపై ఎంపీల కొత్త నివాసాల్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కోరని.. పనిపై ఎక్కువ దృష్టి పెడతారని చెప్పారు. అద్దె భవనాల నుంచి పని చేసే మంత్రిత్వ శాఖల అద్దె ఏటా రూ. 1,500 కోట్లు– ఖర్చు అవుతుందని చెప్పారు. అలాగే ఎంపీలకు కూడా సరైన నివాసాలు లేకపోవడంతో ప్రభుత్వ ఖర్చులు కూడా చాలా -మిగతా 3 లో



## వచ్చే మూడురోజులు భారీ వర్షాలు

హెచ్చరిక జారీ చేసిన భారత వాతావరణ శాఖ

న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా వాతావరణం మళ్లీ ఒక్కసారిగా మారిపోతోంది. ఈ క్రమంలోనే భారత వాతావరణ శాఖ దేశంలోని పలు రాష్ట్రాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ-, ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో వచ్చే మూడు నుంచి ఏడు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసర యాత్రలు చేయొద్దని ఐఎండీ అధికారులు సూచిస్తున్నారు. ఢిల్లీ-ప్రాంతంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని ఐఎండి చెబుతోంది. ఇక్కడ ఎల్లో అలర్ట్ జారీ అయింది. గరిష్ట ఉష్ణోగ్రత 34-36శాతం. ఈ మధ్య, కనిష్ట ఉష్ణోగ్రత 26-28శాతం ఈ మధ్య ఉంటుందట. ఆగస్టు 13, 14 తేదీల్లో వర్షం కారణంగా -మిగతా 3 లో



## రాహుల్ అరెస్ట్



'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతం

- మల్లికార్జున్ ఖర్గే ప్రియాంక, అఖిలేష్ తో సహా పలువురు ఎంపీలు అరెస్ట్
- ఎంపీల ర్యాలీకి పోలీసుల అనుమతి నిరాకరణ
- ర్యాలీని అడ్డుకుని బస్సుల్లో తరలించిన పోలీసులు
- పోలీసులు ,ఎంపీల మధ్య తోపులాట
- బారిగేడ్లు ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- అడ్డుకున్న పోలీసులు.. ఆగ్రహించిన ఎంపీలు

న్యూఢిల్లీ,

బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతంగా మారింది. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను మార్గమధ్యంలో వాళ్లను అడ్డుకుని అరెస్టు చేశారు.. బిహార్‌లో ఓట్ల -మిగతా 3 లో



## సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

- రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం ద్వారా సాయం
- మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష చెక్కు అందించిన భట్టి

హైదరాబాద్,

సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్-2025లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి -మిగతా 3 లో

## సీఎం రేవంత్‌తో పీసీసీ చీఫ్ బేటీ

- బీసీ రిజర్వేషన్లు, తాజా రాజకీయాలపై చర్చ

హైదరాబాద్,

తాజా రీజకాయ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. బిసి రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలపై గంటన్నరకుపైగా సాగిన సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృత్రంగా తీసుకెళ్లడంపై నేతలిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ నెల 16 లేదా 17 తేదీల్లో పీసీసీ, పీఏసీ భేటీ ఉండే అవకాశం ఉంది. ఈ సమావేశంలో మెజారిటీ– నేతల అభిప్రాయాలను -మిగతా 3 లో



## అప్పులపై రేవంత్ చెబుతున్నవన్నీ అబద్ధాలే

- అప్పులు చేయడంలో కాంగ్రెస్ దూకుడు.. ఆస్తులు పెంచడంలో మాత్రం వెనుకడుగు
- రేవంత్ రెడ్డి వాస్తవాలు మాట్లాడాలి
- తమ హయాంలో రాష్ట్ర అప్పు 8 లక్షల కోట్లు కాదని, కేవలం 3.5 లక్షల కోట్లు మాత్రమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,

కేసీఆర్ ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పు చేసిందని పిచ్చోడిలా గాయి గాయి చేసిన రేవంత్ రెడ్డి చెంప ఛెల్లుమనేలా కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆరోపిస్తున్నట్టుగా తమ హయాంలో రాష్ట్ర అప్పు 8 లక్షల కోట్లు కాదని, కేవలం 3.5 లక్షల కోట్లు మాత్రమే -మిగతా 3 లో





## టెన్త్ పరీక్షలపై వెనక్కి తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

- పాత పద్ధతిలోనే పరీక్షలు!

హైదరాబాద్, .

పదో తరగతి పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులు ఎత్తివేయాలన్న నిబంధనపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ వెల్లడించింది. 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. -మిగతా 3 లో

## వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి


తరలింపు ప్రక్రియను అడ్డుకుంటే కఠిన చర్యలు

- ఇంకెంతమాత్రం జాప్యం చేయడం సరికాదు
- 6 వారాల్లోపు వీధి కుక్కలన్నింటినీ పట్టుకోవాలి
- రెబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన
- ఢిల్లీ అధికారులకు సుప్రీకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ,

దిల్లీ, ఎన్సీఆర్‌లలోని అన్ని వీధి కుక్కల బెడదపై సుప్రీం తీవ్రంగా స్పందించిది. వీటిని వెంటనే షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. అలాగే జంతు ప్రేమికులు ఈ విషయంలో అడ్డుకుంటే సహించేది లేదని తెలిపింది. ఈ పక్రియకు ఆటంకం కలిగించే ఏ వ్యక్తి లేదా సంస్థ అయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా హెచ్చరించింది. 6 వారాల్లోపు వీధి కుక్కలన్నింటినీ పట్టుకోవాలని





## ఈడి విచారణకు హాజరైన రానా

సుమారు నాలుగు గంటలపాటు విచారణ

హైదరాబాద్,

బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో సినీ నటుడు దగ్గుబాటి రానా సోమవారం ఇడి విచారణకు హాజరైయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు రానాను సుమారు నాలుగు గంటలపాటు- విచారించారు. విచారణ అనంతరం రానా మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. అయితే ఈ కేసులో రానా బ్యాంకు లావాదేవాలపై అధిరాకారులు విచిరించినట్లు-

# ఎన్నికల సంఘాన్ని బీజేపీ రిగ్గింగ్ మిషన్‌లా మార్చింది



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ కి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మద్దతు పలికారు. బీజేపీ , ఎలక్షన్ కమిషన్ కలిసి నేరపూరిత మోసాలకు పాల్పడ్డాయంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేయించాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈసీని బీజేపీ ఒక రిగ్గింగ్ మిషన్‌లా మార్చిందని మండిపడ్డారు.పోలింగ్‌కు సంబంధించి జరుగుతున్న అక్రమాలపై పోరాటంలో కాంగ్రెస్‌తో డీఎంకే కలిసి నడుస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే అపహాస్యంపాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేమని అన్నారు. రాహుల్ ఆరోపణలపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే ఇవాళ ఢిల్లీలో విపక్ష పార్టీల ఎంపీలు నిర్వహించిన 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. అఖిలేశ్ యాదవ్ సహా పలువురు విపక్ష ఎంపీలు బ్యారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాహుల్, ప్రియాంక సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# నిషేధిత జాబితాలో మరిన్ని పార్టీలు

## రెండోదశలో 476 పార్టీలను గుర్తించిన ఇసి




**న్యూఢిల్లీ, – ప్రజా స్వేచ్ఛ**

చట్టబద్ధతను పాటించని రాజకీయ పార్టీలపై ఈసీ కఠిన చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా మరో 476 పార్టీలను రద్దు చేసే దిశగా చర్యలను మొదలు పెట్టినట్లు- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇటీ-వల 334 పార్టీలను రద్దు చేసిన ఈసీ.. తాజాగా రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించి.. వాటిపై వేటు- వేసే ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా డీలిస్ట్ చేసేందుకు గుర్తించిన పార్టీల జాబితాలో ఏపీ నుంచి 17 పార్టీలు ఉండగా.. తెలంగాణ నుంచి 9 పార్టీలు ఉన్నట్లు- ఈసీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల వ్యవస్థను పటిష్టం చేసేందుకు చేపట్టిన సమగ్రమైన వ్యూహాల్లో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఈసీ పేర్కొంది. 2019 నుంచి ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనైనా పోటీ- చేయని రాజకీయ పార్టీలను గుర్తించి, జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు- తెలిపింది. ఇందులో భాగంగానే తొలి రౌండ్‌లో ఆగస్టు 9న 334 పార్టీలను జాబితా నుంచి తొలగించగా.. రెండో దశలో మరో 476 పార్టీలను గుర్తించినట్లు- వెల్లడించింది. తాము డీలిస్ట్ చేసిన పార్టీలేవీ.. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29సీ, 29బీ ఆదాయపన్ను చట్టం-1961, ఎన్నికల గుర్తులు ఆర్డర్ 1968 కింద ఉన్న ప్రయోజనాలను పొందలేవని ఈసీ స్పష్టం చేసింది.

# ప్రెస్ టెంట్‌పై ఇజ్రాయెల్ దాడులు..


## ఐదుగురు ఆల్ జజీరా జర్నలిస్టులు మృతి




**హమాస్ – ప్రజా స్వేచ్ఛ**

హమాస్ అంతమే లక్ష్యంగా గత 22 నెలలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజాగా ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ ఆల్ జజీరా కు చెందిన ఐదుగురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అల్-షిఫా ఆసుపత్రి సమీపంలో ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఆస్పత్రి బయట ఉన్న ప్రెస్ టెంట్ ధ్వంసమైంది. అందులో ఉన్న ఐదుగురు జర్నిలస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ కూడా ధృవీకరించింది.ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. అందులో ఐదుగురు తమ పాత్రికేయులేనని అల్ జజీరా మీడియా సంస్థ పేర్కొంది. అల్ జజీరా కరస్పాండెంట్స్ అనాస్ అల్ షరీఫ్, మహమ్మద్ ఖ్రీకె, కెమెరామెన్‌లు ఇబ్రహీం జహీర్, మోమెన్ అలివా, మహ్మద్ నౌఫల్ మరణించినట్లు సంస్థ తెలిపింది. అయితే, అనాస్ అల్ షరీఫ్ ఓ ఉగ్రవాది అని ఇజ్రాయెల్ ఆరోపించింది. అతడు హమాస్ టెర్రరిస్ట్ సెల్‌కు హెడ్‌గా పనిచేసినట్లు ఆరోపించింది. జర్నలిస్టు ముసుగులో ఉన్న టెర్రరిస్ట్ షరీఫ్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు ఐడీఎఫ్ స్పష్టం చేసింది.కాగా, ఈ దాడికి కొన్ని నిమిషాల ముందు అనాస్ అల్ షరీఫ్ తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. గాజా నగరంలో ఇజ్రాయెల్ బాంబు దాడులను తీవ్రతరం చేసిందని ట్వీట్ చేశాడు. ఈ ట్వీట్ పెట్టిన కాసేపటికే ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడిలో అతడు మరణించినట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది.

# సెప్టెంబర్‌లో యూఎన్ జనరల్ అసెంబ్లీ.. భేటీకానున్న మోదీ-జెలెన్‌స్కీ



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీతో భారత ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘంగా ఫోన్‌లో సంభాషించారు. ఈ మేరకు ఇద్దరు నేతలు సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. రెండుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ప్రస్తుత అంతర్జాతీయ దౌత్య పరిస్థితిని చర్చించినట్లు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్ ప్రజలకు హృదయపూర్వక మద్దతు ఇచ్చిన మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రష్యా దాడులపై మోదీకి వివరించినట్లు చెప్పారు. రష్యా సైన్యం ఉక్రెయిన్ నగరాలు, గ్రామాలను ఎలా లక్ష్యంగా చేసుకుంటుందో చెప్పారు. డజన్ల కొద్దీ జనం గాయపడిన జపోరిజియా బస్ స్టేషన్‌పై దాడిని సైతం ప్రస్తావించారు.ఈ దాడి ఉద్దేశపూర్వకంగా జరిగినట్లుగా ఆరోపించారు. యుద్ధాన్ని ముగించేందుకు దౌత్యపరమైన అవకాశం ఉందన్నారు. రష్యా కాల్పుల విరమణకు సుముఖత చూపడానికి బదులుగా ఆక్రమణ, హత్యలను కొనసాగించాలని చూస్తోందని.. శాంతిని పునరుద్ధరించేందుకు చేస్తున్న తన ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌కు సంబంధించిన అన్ని సమస్యలను ఉక్రెయిన్ భాగస్వామ్యంతో మాత్రమే పరిష్కరించాలని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. చర్చల ఇతర ఫార్మాట్స్ అసమర్థమైనవని ఆయన అభివర్ణించారు. అలాంటి ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని అన్నారు. ఈ సంభాషణలో ఇద్దరు నాయకులు రష్యాపై విధించిన ఆంక్షలపై సైతం చర్చించారు. రష్యా ఆర్థిక సామర్థ్యాన్ని తగ్గించుకోవడానికి, యుద్ధం కొనసాగింపుకు ఆర్థిక సహాయం చేయలేని విధంగా రష్యా ఇంధనం, ముఖ్యంగా చమురు ఎగుమతిని పరిమితం చేయడం అవసరమని జెలెన్‌స్కీ తెలిపారు. రష్యాను ప్రభావితం చేసే అవకాశం ఉన్న ప్రతి నాయకుడు మాస్కోకు సరైన సందేశాన్ని పంపాలని కోరారు. సెప్టెంబర్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా వ్యక్తిగతంగా సమావేశమయ్యేందుకు ఇద్దరు నేతలు అంగీకరించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సైతం ట్వీట్‌లో స్పందిస్తూ.. ఇటీవల పరిణామాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. రష్యాతో వివాదాన్ని, శాంతియుతంగా పరిష్కరించుకోవాలని.. ఈ విషయంలో సాధ్యమైనంత సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో సంబంధాలను బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 15న అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీకి ముందు ఇద్దరు నేతలు మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అలాస్కాకు ఆహ్వానించే విషయాన్ని వైట్‌హౌస్ పరిశీలిస్తున్నట్లుగా ఓ నివేదిక తెలిపింది.

# మాది అణ్వాయుధ దేశం.. మేం నాశనమైతే సగం ప్రపంచాన్ని మాతో తీసుకెళ్తాం..

## భారత్‌పై నోరుపారేసుకున్న పాక్ ఆర్మీ చీఫ్



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

ఆపరేషన్ సిందూర్‌తో భారత్ చేత చావుదెబ్బ తిన్నప్పటికీ దాయాది పాకిస్థాన్ తీరులో ఎలాంటి మార్పు లేదు. తాజాగా పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన భారత్ పై నోరు పారేసుకున్నారు. తమది అణ్వాయుధ దేశమని, అవసరమైతే అణుయుద్ధానికి దిగుతామంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగారు. తాము నాశనమైతే.. తమతోపాటు సగం ప్రపంచాన్ని తీసుకెళ్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఫ్లోరిడాలోని టాంపాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మునీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా సింధునది వివాదాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌పై నోరుపారేసుకున్నారు. సింధు నది భారతీయుల ఆస్తిఏమీ కాదంటూ వ్యాఖ్యానించారు. ఆ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు ఎదురు చూస్తామని చెప్పారు. తమ వద్ద క్షిపణులకు ఎలాంటి కొదవ లేదని, ఆ డ్యామ్‌లను పది క్షిపణులతో పేల్చేస్తామని హెచ్చరించారు. భారత్ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఏర్పడితే, తాము నాశనం అవుతూనే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కాగా, అసిం మునీర్ యూఎస్ సందర్శనకు వెళ్లడం రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈఏడాది జూన్‌లో అసిం మునీర్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రంప్ వైట్ హౌస్‌లో మునీర్‌కు ప్రత్యేకంగా విందు కూడా ఇచ్చారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో.. వాషింగ్టన్‌తో పాకిస్థాన్ సంబంధాలు బలపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

# జాతీయ క్రీడా పరిపాలన, యాంటీడోపింగ్ బిల్లులకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

జాతీయ క్రీడా పరిపాలనా బిల్లు, జాతీయ యాంటీ-డోపింగ్ సవరణ బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఆ బిల్లులను క్రీడాశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ ఇవాళ సభలో ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత క్రీడల్లో జరిగిన అతిపెద్ద సంస్కరణజాతీయ క్రీడా పరిపాలన బిల్లు అని మంత్రి తెలిపారు. క్రీడాకారులు వైభవోపేతంగా వెలిగిపోవాలన్న ఉద్దేశంతో క్రీడా గవర్నెన్స్ బిల్లును తీసుకువచ్చినట్లు మంత్రి చెప్పారు. క్రీడా వ్యవహారాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే ఉద్దేశం కూడా ఉన్నట్లు ఆయన చెప్పారు.యాంటీ డోపింగ్ బిల్లు కూడా కొత్త చట్టమే అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డోపింగ్ విధానాలను ఇది సమర్థిస్తుందన్నారు. పారదర్శకంగా డోపింగ్ చర్యలు చేపట్టే విధంగా చూడనున్నట్లు చెప్పారు. ఒకవైపు బిల్లుపై చర్చ జరుగుతుంటే.. విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. బీహార్‌లో జరిగిన సిర్ ప్రక్రియపై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ బిల్లును పాస్ చేశారు. రెండు క్రీడా బిల్లులు పాసైన తర్వాత తాత్కాలిక చైర్ సంధ్యా రే లోక్‌సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు.

# ఓట్లను లూటీ చేశారు

## – అఖిలేష్ యాదవ్ మండిపాటు

**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

ఉత్తరప్రదేశ్ సహా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఓటరు జాబితాల తయారీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినప్పటికీ ఎన్నికల కమిషన్ వాటిని అరికట్టలేకపోయిందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో అధికార బిజెపితో అధికారులు కుమ్మక్కయ్యారని, ఓట్లను లూటీ చేశారని మండిపడ్డారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లో సోమవారం అఖిలేష్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల అవకతవకలపై తమ పార్టీ పదే పదే ఫిర్యాదులు చేసినప్పటికీ కమిషన్ వాటిని పట్టించుకోలేదని చెప్పారు.

# 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 2.17 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు గుర్తింపు



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డినామినేషన్లకు చెందిన 2.17 లక్షలకు పైగా నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించారు. ఇందులో 1.17 లక్షలకుపైగా కొత్త రూ.500 నకిలీ నోట్లు ఉన్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2.23 లక్షలకుపైగా నకిలీ నోట్లను గుర్తించినట్లు తెలిపారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ డినామినేషన్లకు చెందిన 2.17 లక్షలకు పైగా నకిలీ నోట్లు బయటపడినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా కొత్త రూ.500కు చెందిన 1,17,722 నకిలీ నోట్లు ఉన్నాయని అన్నారు. అలాగే రూ.100 డినామినేషన్లకు చెందిన 51,069 నకిలీ నోట్లు, రూ.200కు చెందిన నకిలీ నోట్లు 32,660 ఉన్నాయని పార్లమెంట్‌కు వెల్లడించారు.కాగా, కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)తో సంప్రదించి కరెన్సీ నోట్ల భద్రతను సమీక్షిస్తున్నది ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఆర్బీఐ చట్టం 1934లోని సెక్షన్ 25 ప్రకారం కొత్త భద్రతా ఫీచర్లు, కొత్త డిజైన్లు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా నకిలీ నోట్ల కట్టడికి నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్బీఐకు సంబంధించిన ఇతర ప్రశ్నలకు కూడా కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

# టర్కీని వణికించిన భూకంపం



**ఇస్తాంబుల్ – ప్రజా స్వేచ్ఛ**

టర్కీని భూకంపం వణికించింది. బలికెసిర్ ప్రావిన్సులో ఆదివారం సాయంత్రం భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.1గా నమోదైంది. ఈ భూకంప తీవ్రతకు 200 కిలోమీటర్ల దూరంలోని ఇస్తాంబుల్‌లోనూ భూమి కంపించింది. భూకంపం ధాటికి సిందిర్గి పట్టణంలో దాదాపు 16 భవనాలు నేలమట్టం అయ్యాయి. శిథిలాల కింద చిక్కుకుని 29 మంది తీవ్రంగా గాయపడగా, ఓ యువతి ప్రాణాలు కోల్పోయింది. శిథిలాలను తొలగించేందుకు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

# రాహుల్ అరెస్ట్

(మొదటి తరువాయి)

జాబితా సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఈ ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయల్దేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ సహా దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు పాల్గొన్నారు. అయితే.. ఈ ర్యాలీకి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంసద్ మార్గ్‌లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ రహదారిని బ్లాక్ చేసి బారికేడ్లు పెట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అఖిలేశ్ యాదవ్ సహా కొంతమంది ఎంపీలు బారికేడ్లు దూకేందుకు యత్నించారు. వాటిపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని నిలువరించారు. విపక్ష ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. పార్లమెంట్ భవన్ నుంచి ఈసీ ఆఫీస్‌కు మార్చ్ చేపట్టింది. విపక్ష ఎంపీలంతా ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రానికి, ఈసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యతిరేక నినాదాలు చేశారు. అయితే అనుమతి లేదంటూ బారికేడ్ల దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఎంపీలు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలో మహిళా ఎంపీలు, అఖిలేష్ యాదవ్ బారికేడ్లు దూకే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఆశ్చర్యంలో కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా ఉండే శశిథరూర్ అనూహ్యంగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు, బిహార్ సమగ్ర సవరణ సర్వే సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈసీకి లేఖ రాశారు.

# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

(మొదటి తరువాయి)

విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా రెండో సంవత్సరం అమలుచేస్తున్నామన్నారు. సివిల్స్ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు.

ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అనిభట్టి విక్రమార్క అన్నారు. మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కొచించ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టు-కోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళ్లు.. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. ఢిల్లీలో నా క్వార్టర్స్‌ను చదువుకునే వారికే ఇచ్చా. నా క్వార్టర్స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

# అప్పులపై రేవంత్ చెబుతున్నవన్నీ అబద్ధాలే

(మొదటి తరువాయి)

అన్న నిజాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో రేవంత్ రెడ్డి అండ్ గ్యాంగ్ చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలన్న సంగతి పార్లమెంట్‌లో ఇవాళ నిరూపించబడిందని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులంటూ నిరాధార ప్రచారానికి దిగిన రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని కేటీఆర్ ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం తలకు మించిన అప్పులు చేయలేదని కేటీఆర్ తెలిపారు. తాము అధికారం నుంచి దిగిపోయిన తర్వాత అంటే 2024 మార్చి 31 నాటికి తెలంగాణ ప్రభుత్వ అప్పు రూ. 3,50,520.39 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ అనవసరంగా అప్పులు చేయలేదని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలకే కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆస్తుల సృష్టి కోసమే తెచ్చిన అప్పులను ఉపయోగించిందని వివరించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆ నిధులను ఖర్చు చేసిందన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ, సమర్థతతోనే రాష్ట్రం వేగంగా పురోగమించిందని కేటీఆర్ స్పష్టం చేశారు.

అప్పుల కంటే ఆస్తుల విలువ ఎక్కువ

బీఆర్ఎస్ ప్రభుత్వం తెలివిగా ఆర్థిక నిర్వహణ చేసిన సంగతి కేంద్రం ఇచ్చిన నివేదికతో తెలుస్తుందని కేటీఆర్ అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అప్పులు రూ. 3,50,520.39 కోట్లు అయితే, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల విలువ రూ. 4,15,099.69 కోట్లుగా ఉందని తెలిపారు. అంటే, అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 64,579 కోట్లు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. గత ఆరు ఆర్థిక సంవత్సరాలుగా (2018-19 నుండి 2023-24 వరకు) ప్రతి ఏటా తెలంగాణ అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 50 వేల కోట్లకు పైగా పెరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సమర్థతకు ఈ గణాంకాలే నిదర్శనం అన్నారు.

అప్పులు చేయడంలో కాంగ్రెస్ దూకుడు..ఆస్తులు పెంచడంలో మాత్రం వెనుకడుగు

బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేస్తుందని ఆరోపించిన రేవంత్ రెడ్డి.. తాను ముఖ్యమంత్రి అయిన మరు క్షణం నుంచే విపరీతంగా అప్పులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. 2023 డిసెంబర్ నుంచి అంటే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ మార్గాల ద్వారా రూ. 1.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ అప్పులు చేసినట్లు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అంగీకరించిన సంగతిని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టకుండానే, హామీ ఇచ్చిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలుచేయకుండానే రేవంత్ ప్రభుత్వం ఇన్ని లక్షల కోట్లు అప్పు ఎందుకు చేసిందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వ అనాలోచిత, అస్తవ్యస్త ఆర్థిక నిర్వహణతో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుందని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి వాస్తవాలు మాట్లాడాలి

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కేంద్రం ఇచ్చిన గణాంకాలపై ఏం సమాధానం చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. నిజాలు తెలుసుకుని, నిరాధారమైన ఆరోపణలు మానుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పారదర్శకత లేని ఆర్థిక విధానాలను అవలంబిస్తూ, అప్పులను ప్రజల మీద మోపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా తమ పరిపాలన గురించి సమీక్షించుకోవాలన్నారు.

# వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి

(మొదటి తరువాయి)

తెలిపింది. అన్ని కుక్కలను క్రిమిరహితం చేసి శాశ్వతంగా ఆశ్రయాలకు తరలించాలని ఉత్తర్వులో న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ లేకుండా ఈ పక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.వీటిని వెంటనే షెల్టర్లకు తరలించాలని అధికారులకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ ఆదేశాలు జారీ చేసింది. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని చెప్పింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయంపై



విచారణ కొనసాగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టు-కొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా దిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది. వీధికుక్కల తరలింపు ప్రదేశాలపై జస్టిస్ పార్దివాలా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయాన్ని కోరగా.. ఇందుకోసం ఇప్పటికే ఓ ప్రదేశాన్ని గుర్తించారని తెలిపారు. జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ పొందడంతో ఆ పనులు నిలిచిపోయాయని న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ పార్దివాలా 'ఆ జంతు ప్రేమికులందరూ కలిసి రేబిస్‌తో ప్రాణాలు కోల్పోయిన వారిని తిరిగి తీసుకురాగలుతారా?' అని ప్రశ్నించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా ఎవరికీ అనుమతి ఇవ్వొద్దని అన్నారు. కుక్కల కోసం వెంటనే షెల్టర్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

# అణు బెదిరింపులకు భయపడం

(మొదటి తరువాయి)

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మునీర్ వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. మునీర్ అణు బెదిరింపులను తీవ్రంగా ఖండించింది. అమెరికా నుంచి పాక్ ఆర్మీ చీఫ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొంది.ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదని తెలిపింది. దేశ భద్రత కోసం ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు పాక్‌పై విరుచుకుపడుతూ భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా భారత్‌పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం పాక్‌కు అలవాటేనని దుయ్యబట్టింది. అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటేనని పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలతో ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. పాక్ అణ్వాయుధాలపై ఎవరి నియంత్రణ ఉందో దీన్నిబట్టే స్పష్టమవుతోందని పేర్కొంది. పాక్ సైన్యం.. తీవ్రవాద గ్రూపులతో చేతులు కలిపిందని విదేశాంగ శాఖ తన ప్రకటనలో వ్యాఖ్యానించింది.

# ఏంపీలకు మరో కొత్త నివాస సముదాయం

(మొదటి తరువాయి)

ఎక్కువగా అవుతున్నాయని వెల్లడించారు. నివాసాల కొరత ఉండడంతో 2014 నుంచి 2024 వరకు దాదాపు 350 మంది ఎంపీలకు కొత్త నివాసాలు నిర్మించినట్లు- తెలిపారు. తాజాగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో 184 మందికి పైగా ఎంపీలు కలిసి నివాసం ఉండొచ్చని చెప్పారు. ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో కొత్త నివాస సముదాయాన్ని నిర్మించారు. -టైప్-÷ఎఒఒలో భాగంగా 184 ఫ్లాట్లతో బహుళ అంతస్తులతో ఈ నిర్మాణం చేపట్టారు. సోమవారం ఈ నివాసాన్ని ప్రారంభించే ముందు ప్రాంగణంలో సింధూర మొక్కను మోడీ నాటారు. అనంతరం కార్మికులతో సంభాషించారు. ప్రతీ ఫ్లాట్ చాలా విశాలంగా నిర్మించినట్లు తెలుస్తోంది.ఈ భవనం అల్యూమినియం షట్టరింగ్‌తో కూడిన మోనోలిథిక్ కాంక్రీటును ఉపయోగించి నిర్మించారు.

## వచ్చే మూడురోజులు
# భారీ వర్షాలు

(మొదటి తరువాయి)

చల్లగా అనిపిస్తుంది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, లక్నో, గోరఖ్‌పూర్, వారణాసి, మీరట్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఇక్కడ రోజువారి ఉష్ణోగ్రత 32-35శాతం. రాత్రి 24-27శాతం మధ్య ఉంటుంది. బీహార్‌లోని దక్షిణ జిల్లాలు గయా, పట్నా, నవాడా, భాగల్పూర్‌లలో ఆగస్టు 12 నుంచి 14 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ అయింది. నవాడాలో గంగా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటు-తోంది. ఉత్తర బీహార్‌లో మోస్తరు వర్షాలతో పాటు- 40-50 కి.మీ వేగంతో గాలులు, పిడుగులు పడే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కాబట్టి, ఈ ప్రాంతాల్లో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి. ఉత్తరాఖండ్‌లో ఆగస్టు 12న రెడ్ అలర్ట్ జారీ అయింది. ఉత్తర కాశీ, రుద్ర ప్రయాగ్, చమోలీ, బాగేశ్వర్, పిథోరాగఢ్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాల్లో 13 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందట. ఆగస్టు 13, 14 తేదీలకు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుంది. డెహ్రాడూన్, బాగేశ్వర్‌లలో భారీ వర్షాల కారణంగా పాఠశాలలు మూసివేశారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున, ఈ ప్రాంతంలో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, సోలన్, షిమ్లా, సిర్మౌర్, మండీ, చంబా, కాంగ్రా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఆగస్టు 12న భారీ వర్షాలు, ఆ తర్వాత 13, 14 తేదీల్లో మోస్తరు వర్షాలతో పాటు 30-40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా. మన తెలంగాణలో కూడా ఆగస్టు 17 వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఒఃఉ హెచ్చరించింది. ఆగస్టు 13 నుంచి 17 వరకు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కాబట్టి, లోతట్టు- ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

# సీఎం రేవంత్‌తో పీసీసీ చీఫ్ బేటీ

(మొదటి తరువాయి)

పరిగణనలోకి తీసుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా 42శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై ఆ సమావేశంలోనే నిర్ణయం తీసుకోనున్నారు. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల పోస్టుల నియామకాలు త్వరగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై నేతలు చర్చించినట్లు- సమాచారం.

## టెన్త్ పరీక్షలపై వెనక్కి
# తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

(మొదటి తరువాయి)

పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులను ఎత్తివేసి 100 మార్కులకు ప్రశ్నపత్రం రూపొందించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది నవంబర్‌లో జీవో జారీ చేసింది.అయితే ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఎన్సీఈఆర్టీ వర్క్‌షాపులో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ అధికారులు.. పాత విధానాన్నే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# ఈడి విచారణకు హాజరైన రానా

(మొదటి తరువాయి)

తెలుస్తోంది. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు తీసుకున్న పారితోషకం ఇతర వివరాలపై ఇడి అధికారులు రానాను ప్రశ్నించినట్లు- తెలిసింది. రానా తన బ్యాంకు సంబంధించిన లావాదేవీల వివరాలు అధికారులకు అందించారు. బెట్టింగ్ యాప్ కేసులో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఇడి వరుసగా నిందితులను విచారిస్తోంది. ఇప్పటికే నటు-లు ప్రకాష్ రాజ్, విజయ్ దేవరకొండ, తాజాగా రానాను విచారించగా, రేపు నటి మంచులక్ష్మిని సైతం ఇడి అధికారులు విచారించనున్నారు. ఇప్పటికే విచారణకు రావాలని మంచు లక్ష్మికి అధికారులు నోటీ-సులు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌పై నటు-లు, టివీ హోస్ట్‌లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు 29 మందిపై రాష్ట్రంలోని పలు చోట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుల ఆధారంగా ఇడి రంగంలోకి దిగింది.

## సంపాదకీయం

# భారత యువత- సమస్యలు, సవాళ్లు



ఆగస్టు 12 అంతర్జాతీయ యువ దినోత్సవం. ఈరోజు కేవలం ఉత్సవంగా కాకుండా, యువతకు రాజకీయ హక్కులు, నాణ్యమైన విద్య, సరైన ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తుచేసే రోజుకావాలి. ఇవి అందకపోతే, మనం గర్వంగా చెప్పుకునే యువ జనాభా లాభం వృథా అవుతుంది. ఎందుకంటే, భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం. నివేదికల ప్రకారం.. మన దేశం మొత్తం జనాభాలో పదిహేను నుండి 29 ఏళ్ల వయసున్న యువ జనాభా 42 కోట్ల మంది. వీరు మొత్తం జనాభాలో సుమారు 29 శాతం. యువత సగటు వయస్సు కేవలం 28.4 సంవత్సరాలు. కానీ, రాజకీయ రంగంలో యువత ప్రాతినిధ్యం ఇంకా పరిమితంగానే ఉండటం ఆందోళన కలిగించే అంశం. దేశంలో యువత అధికం ఉన్నప్పటికీ, ప్రతినిధుల వయస్సు పెరుగుతోంది. 17వ లోక్‌సభలో 41 ఏండ్ల లోపు ఎంపీలు కేవలం 64 మంది మాత్రమే.ఇది యువతలో రాజకీయ శూన్యతను ఎత్తిచూపుతోంది. విద్యారంగం కూడా సమాన సవాళ్లను ఎదుర్కొంటోంది. 15-24 ఏళ్ల వయస్సు గల యువతలో సాక్షరత రేటు 81శాతం మాత్రమే. పురుషుల్లో 84.4శాతం, మహిళల్లో 74.4శాతం. రాష్ట్రాల వారీగా చూస్తే, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో యాభై శాతానికి పైగా యువత డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ చదువు పూర్తిచేస్తుంటే, బీహార్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ సంఖ్య 20 నుంచి 22 శాతం మాత్రమే. కొన్నిచోట్ల 25శాతం యువతకే ప్రాథమిక విద్య ఉంది. యునెస్కో నివేదిక ప్రకారం, "లెర్నింగ్ పావర్టీ" ఇంకా కొనసాగుతూనే ఉంది అనేక పిల్లలు పాఠశాలకు వెళ్లినా సాదాసీదా వాక్యాన్నే అర్థం చేసుకోలేకపోతున్నారు. ఉపాధ్యాయుల కొరతతో, పాఠశాలల్లో విద్యార్థి ఉపాధ్యా య నిష్పత్తి 40:1 కంటే ఎక్కువగా ఉంది. ఆర్థిక వృద్ధి రేటు కూడా ఆందోళన కలిగిస్తోంది. 2003-15 మధ్య దేశం సగటున 7.8 శాతం వృద్ధి సాధించినా, 2014-24లో ఇది 5.8శాతానికి పడిపోయింది. అంతర్జాతీయ అంచనాల ప్రకారం 2020-30లో భారత వృద్ధి రేటు 6.7శాతానికి మించదట. ఎనిమిది శాతం వృద్ధి రేటు సాధించకపోతే, యువ జనాభా లాభం చేజారిపోతుంది. తయారీ రంగం 2014లో 17శాతం నుంచి 2022లో 13శాతానికి పడిపోవడం 'మేక్ ఇన్ ఇండియా' ఆశలపై నీళ్లు చల్లింది. ఉద్యోగ అవకాశాల లోటు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. యువ నిరుద్యోగం 2017-18లో 17.8శాతం ఉండగా, 2022-23లో పది శాతానికి తగ్గింది. కానీ 2024లో మళ్లీ 16.03శాతానికి పెరిగే అవకాశం ఉంది. దేశంలోని నిరుద్యోగుల్లో 83శాతం మంది యువతే. 2022లో నిరుద్యోగ యువతలో 65.7శాతంమంది కనీసం మాధ్యమిక విద్య లేదా అంతకంటే ఎక్కువ అర్హత కలవారు అంటే చదువు ఉన్నా ఉద్యోగం లేదు. ఇది విద్యలో నేర్పే నైపుణ్యాలు, ఉద్యోగ మార్కెట్ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని చూపిస్తోంది.పట్టభద్రుల్లో నిరుద్యోగ రేటు 29.1శాతంగా ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ %-% భారతదేశ ఉపాధి నివేదిక 2024 తెలిపింది. ఇది వారి నైపుణ్యాలకు, ఉద్యోగ మార్కెట్ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ఉద్యోగ లేమి, ఆర్థిక అనిశ్చితి, సామాజిక ఒత్తిళ్లు, పోటీ వాతావరణం వంటివి యువతపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని పెంచుతోంది. 2022లో కేవలం 15.6శాతం యువతే వృత్తి శిక్షణ పొందగా, వారిలో కేవలం నాలుగు శాతం మందికే అధికారిక సర్టిఫికేషన్ వచ్చింది. ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద 1.6కోట్ల యువత శిక్షణ పొందినా, వారిలో పదిహేను శాతం మందికే ఉద్యోగం దొరికింది. కొన్ని రాష్ట్రాల్లో ఉదాహరణకు కర్నాటకలో "యువనిధి" పథకం నమోదైనవారు ఎక్కువైనా, శిక్షణ పొందిన వారు తక్కువ. నిరుద్యోగ భృతి కోల్పోతామనే భయం, అవగాహన లోపం పాల్గొనడాన్ని అడ్డుకుంటున్నాయి. తెలంగాణలో, రాజీవ్ యువ వికాసం పథకానికి 16 లక్షల దరఖాస్తులు వచ్చినప్పటికీ, కొత్త సంక్షేమ పథకాలు వాయిదా పడటంతో ఇది తాత్కాలికంగా నిలిచిపోయింది. రాజకీయ భాగస్వామ్యం, విద్యా నాణ్యత, ఉద్యోగ అవకాశాలు ఈ మూడు రంగాల్లో లోపాలు ఉన్నప్పుడు, యువతను సమర్థంగా దేశాభివృద్ధి దిశగా నడిపించడం కష్టసాధ్యం. అంతర్జాతీయ యువ దినోత్సవం కేవలం జ్ఞాపక దినం కాకుండా, చర్యకు పిలుపుగా మారాలి. యువతకు నిజమైన రాజకీయ స్వరం, నాణ్యమైన విద్య, తగిన నైపుణ్యాలు, విస్తృత ఉపాధి అవకాశాలు అందించాలి. 2040 తర్వాత యువ జనాభా లాభం మన చేతుల్లో ఉండదు. కాబట్టి, ఇప్పటినుంచే ధైర్యవంతమైన చర్యలు తీసుకుంటే, భారత యువత దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే ప్రధానశక్తిగా నిలుస్తుంది. ఇదే మన యువతకు, దేశానికి అసలు సందేశం.

# జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడున్నారు..?

## అమిత్‌షాకు సంజయ్‌రౌత్ లేఖ








**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. ఆయన నిర్ణయం అందరినీ షాక్‌కు గురి చేసింది. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రతిపక్షాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు రాజీనామా తర్వాత నుంచి ఆయన ఎక్కడా కనిపించడం లేదు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. ఆయన్ని సంప్రదించలేకపోతున్నారు. దీంతో 'జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడ..?' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.ఇదే విషయమై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము చేరుకోలేకపోతున్నామని, ఆయన ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నించారు. ఆయన ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజీనామా చేసినప్పటి నుంచి ధన్‌ఖడ్ గురించి ఎలాంటి సమాచారం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన భద్రతపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది..? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా..? అని ప్రశ్నించారు. ఆయన్ని కలిసేందుకు పలువురు రాజ్యసభ ఎంపీలు ప్రయత్నించినట్లు చెప్పారు. కానీ, ఆయన్ని చేరుకోలేకపోతున్నట్లు వెల్లడించారు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని లేఖలో సంజయ్ రౌత్ పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు జూలై 21న రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

# 18 ఏళ్లు నిండిన వారికి తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్..

**18 ఏళ్లు ఆగస్ట్ 13 వరకు అవకాశం!**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి





**హైదరాబాద్, – ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ సర్కార్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోంది. ముఖ్యంగా రైతులపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది ప్రభుత్వం. రైతు భరోసా, రైతు బీమా, పసల్ బీమా యోజన వంటి పథకాలు అమలు చేస్తోంది. అయితే రైతులకు పంట పెట్టుబడి సాయంలో ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో రైతు భరోసా నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం రైతు బీమా పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మకమైన పథకాల్లో ఒకటైన 'రైతు బీమా'కు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు చివరి గడువు ఆగస్ట్ 13. ఈలోగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం రైతులకు సూచించింది. కొత్తగా పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు, అలాగే గతంలో పాస్ బుక్ ఉన్నప్పటికీ ఈ స్కీమ్‌లో చేరని వారికి కూడా అవకాశం ఇస్తోంది. ఆగస్ట్ 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 76 లక్షల మందికి పైగా పట్టాదారు పాస్ బుక్ ఉన్న రైతులు ఉన్నారు.

# సనాతన ధర్మంపై కమల్ హసన్ వివాదాస్పద వ్యాఖ్యలు..

## గొంతు కోస్తానని హెచ్చరించిన టీవీ నటుడు..!



**న్యూఢిల్లీ – ప్రజా స్వేచ్ఛ**

విశ్వ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ నేత కమల్ హసన్‌ను చంపేస్తానని ఓ టీవీ నటుడు హెచ్చరించాడు. ఇటీవల కార్యక్రమంలో కమల్ హసన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో కలకలం సృష్టించాయి. పలు టీవీ షోల్లో పని చేసిన నటుడు రవిచంద్రన్ ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల్ హసన్‌పై అభ్యంతరక వ్యాఖ్యలు చేశారు. కమల్ హసన్‌ను బుద్ధిలేని రాజకీయ నాయకుడిగా అభివర్ణించారు. సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకు గొంతుకోస్తానని హెచ్చరించారు. రవిచంద్రన్ వ్యాఖ్యలపై కమల్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బెదిరింపులపై కమల్ పార్టీకి చెందిన పలువురు సభ్యులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసి.. నటుడికి రక్షణ కల్పించాలని కోరారు.ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన కమల్.. తమిళ నటుడు సూర్యకు చెందిన అగరం ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షలపై విమర్శలు గుప్పించారు. నీట్ 2017 నుంచి చాలామంది ఎంబీబీఎస్ చేయాలన్న కలలను కల్లలు చేసిందని ఆరోపించారు. అలాగే, మరోసారి సనాతన ధర్మంపై విరుచుకుపడ్డారు. నియంతృత్వం, సనాతన ధర్మం సంకెళ్లను బద్దలు కొట్టగల ఏకైక ఆయుధం విద్య అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీతో పాటు పలువురు నేతలు ఖండించారు. ఇదిలా ఉండగా కమల్ హసన్ సినిమాల విషయానికి వస్తే.. చివరిసారిగా ఈ ఏడాది థగ్ లైఫ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమా ఆకట్టుకోలేకపోయింది. ఇక రవిచంద్రన్ విషయానికి వస్తే పలు సీరియల్స్‌లో నటించి గుర్తింపును పొందారు. పాండియన్ స్టోర్స్ టెలివిజన్ షోలో నటించారు. సెంథిల్ క్యారక్టర్‌లో నటించి మంచి గుర్తింపును పొందారు.

# విద్యాశాఖ యూటర్న్..
# పాత పద్ధతిలోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు!



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్, – ప్రజా స్వేచ్ఛ**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కీలక మార్పులు చేస్తున్నట్లు విద్యాశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై తాజాగా యూటర్న్ తీసుకుంది. ఈ ఏడాదికి పాత పద్ధతిలోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉంటాయని తెలంగాణ విద్యాశాఖ తాజాగా వెల్లడించింది. అయితే పదో తరగతి పరీక్షల్లో 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగించాలని, 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులకు కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. నిజానికి, పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులు ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం వంద మార్కులకు పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. అయితే ఈ నిర్ణయంపై సర్కార్ వెనక్కి తగ్గింది. పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు నిర్వహిస్తామని విద్యాశాఖ వెల్లడించింది. దీంతో 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం యథావిధిగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాదికి అసలు ఇంటర్నల్ మార్కులు ఉంటాయా? లేదా? అనే అంశంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్న నేపథ్యంలో రేవంత్ సర్కార్ ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులకు క్లారిటీ లభించింది. ఇటీవల ఢిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడిన పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు పాత విధానాన్నే కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది.

# పలు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన
# శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరి లింగంపల్లి – ప్రజా స్వేచ్ఛ**

శేరిలింగంపల్లి డివిజన్ లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రూ. 15 కోట్ల 83 లక్షల వ్యయంతో శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన.. వెంకట్ రెడ్డి కాలనీ, బృందావనం కాలనీ, పాపిరెడ్డి నగర్, సుదర్శన్ నగర్ కాలనీ, భాగ్య లక్ష్మి నగర్ ఫేస్-2, శిల్పా గార్డెన్స్, వెంకటేశ్వర కాలనీ, సెంట్రల్ పార్క్ ఫేస్ -2, కామ్లెట్ కాలనీ, శ్రీ మారుతీ నగర్, సీఎంసీ లేఔట్, ఇందిరానగర్ లలో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల పనులకు కల్వెర్ట్, బాక్స్ డ్రైన్ మరియు ఆర్ సీసీ బాక్స్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీ, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పాలనలో క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, వార్డ్ మెంబర్ రాంబాబు, వార్డ్ మెంబర్ శ్రీకళ, వార్డ్ మెంబర్ రాము, ఎస్ ఎల్ వి డి సి ప్రెసిడెంట్ రవి యాదవ్, గచ్చిబౌలి విలేజ్ ప్రెసిడెంట్ రవి యాదవ్, గచ్చిబౌలి విలేజ్ ప్రెసిడెంట్ సయ్యద్ నయీమ్, సుదర్శన్ నగర్ కాలనీ యూత్ ప్రెసిడెంట్ రమేష్, ఇందిరానగర్ కాలనీ ప్రెసిడెంట్ అఫ్జల్ తదితర కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్లు మెంబర్లు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం హేయమైన చర్య





**టి.మేఘారెడ్డి ఎమ్మెల్యే వనపర్తి**

**– ప్రజా స్వేచ్ఛ జిల్లా ప్రతినిధి. వనపర్తి.**

దొంగ ఓట్ల తొలగింపు పై గళమెత్తి పూర్తిస్థాయిలో నిరూపించి వాటిని తొలగించాలని నేడు, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను అరెస్టు చేయడం హేయమైన చర్య అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాదులోని గాంధీభవన్లో ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో, ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన బిజెపి వెంటనే దొంగ ఓట్లను తొలగించాలని, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ గత పది రోజుల క్రితం డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ చేసిన డిమాండ్ నిరాధారమని చేతనైతే నిరూపించాలని బిజెపి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అందుకు స్పందించిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు బీహార్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, ముంబై తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న దొంగ ఓట్ల జాబితాను వారు బహిర్గతం చేసి నేడు ఢిల్లీలో దొంగ ఓట్లను తొలగించాలంటూ శాంతియుత మార్గం నిరసన చేపట్టగా వారిని అరెస్టు చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే ఖండించారు. బిసి వ్యతిరేక పార్టీ అయిన బిజెపి, బిసి బిల్లుకు కూడా ఇవ్వడం లేదన్నారు. ఇలాంటి అరెస్ట్ లకు రాహుల్ గాంధీ భయపడే వ్యక్తి కాదని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిపక్షాల మద్దతుతో గద్దెనెక్కిన ప్రభుత్వం బిజెపి అని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అవుతుందని అప్పుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని ఆయన అన్నారు. గత పది ఏళ్లలో సంవత్సరానికి 50 ఇందిరమ్మ ఇళ్లు, కొన్ని రేషన్ కార్డులు ఇచ్చిన ఇంత డిమాండ్ ఉండేది కాదని ఎమ్మెల్యే అన్నారు. హైడ్రా పై అవక్కులు చేవాక్కులు చేసి, కెటిఆర్, హరీష్ రావ్ లు నేడు మాట్లాడడం లేదు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధికి సీఎం.ఎనుముల రేవంత్ రెడ్డి, అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డీ పేర్కొన్నారు.

# ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యం లో చదరంగం బోర్డ్స్,మరియు కాయిన్స్ వితరణ

**-45 పాఠశాలలకు, 167 చదరంగం బోర్డు, కాయిన్స్ వితరణ.**



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి.**

పాలమూరు ఎన్నారై ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో, సోమవారం రోజు గ్రామీణ ప్రాంతంలో గల ప్రభుత్వ పాఠశాలలకు చదరంగం ఆటపై ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో, మండల పరిధిలో 45 పాఠశాలలకు, 167 చదరంగం బోర్డ్స్, మరియు, కాయిన్స్ ఇవ్వడం జరిగింది. 15 మంది విద్యార్థులకు ఒక చదరంగం బోర్డు, మరియు కాయిన్స్ కో చొప్పున, పెద్దమందడి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా ఇవ్వడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బలిజపల్లి జంగమయపల్లి నందు జరిగిన కార్యక్రమంలో వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నారై ఫౌండేషన్ సభ్యులు రవి శంకర్, మరియు మహిపాల్ రెడ్డి, విచ్చేసి విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాలమూరు ఎన్నారై ఫౌండేషన్ వారికి, మండల విద్యాశాఖ అధికారి ఎస్.మంజులత, ప్రధానోపాధ్యాయులు, మరియు అధ్యాపక బృందం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎస్.మంజులత, పెద్దమందడి మండలంలోని కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు యస్.వరప్రసాదరావు, శాంతన్న, బాణం విష్ణు, బలిజపల్లి జంగమయ్యపల్లి పాఠశాల ఉపాధ్యాయ బృందము వివిధ పాఠశాలల నుంచి విచ్చేసినటువంటి వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# బి యన్ రెడ్డి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**-జిహెచ్ఎంసి కమిషనర్ కి వినతి అందజేసిన జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**



**ప్రజా స్వేచ్ఛ**

**ఎల్ బి నగర్ నియోజకవర్గ ప్రతినిధి**

బి యన్ రెడ్డి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని సోమవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఐ ఏ ఎస్ కి బి యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లలో నూతనంగా ఏర్పడిన కాలనీలకు మౌలిక సదుపాయాలు కాలనీలలో నూతన రోడ్లు,పార్కుల స్థలాలకు ప్రహరి గోడలు,సంక్షేమ సంఘం భవనాలకు డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కమీషనర్ ని కోరడం జరిగింది. సాహనుకూలంగా స్పందించిన కమిషనర్ డివిజన్ అభివృద్ధికి అతి త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు

# ప్రజావాణిలోఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ



**ప్రజా స్వేచ్ఛ మెదక్ జిల్లా ప్రతినిధి**

సోమవారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా ప్రజల నుండి సుమారు 21 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ మరియు సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసుసేవల్నివినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని ఎస్.పి. డి. వి. శ్రీనివాస రావు తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

# విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



**– ప్రజా స్వేచ్ఛ   బైంసా ప్రతినిధి**

విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు హరిప్రసాద్ సూచించారు, ప్రభుత్వ ఆదేశాల లతో ప్రిన్సిపాల్ శివరంజని సూచనల మేరకు సోమవారం కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇత్త వయసులో విద్యార్థులు పౌష్టికారాన్ని తీసుకుంటూ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు, ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రజనీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు,

# సబ్ కలెక్టర్ కు సన్మానం




**– ప్రజా స్వేచ్ఛ   బైంసా ప్రతినిధి**

బైంసా సౌత్ డివిజన్ పరిధిలో నూతనంగా సబ్ కలెక్టర్ గా బాధ్యతలను స్వీకరించిన అజ్మీర సంకేత్ కుమార్ ను కాంగ్రెస్ నాయకులు మాటేగా హైమద్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు, ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు,

# ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలి

**బీజేపీ శేరిలింగంపల్లి ఇంఛార్జి రవికుమార్ యాదవ్**



**– ప్రజా స్వేచ్ఛ   శేరి లింగంపల్లి ప్రతినిధి**

దేశం కోసం పోరాడిన స్వతంత్ర సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ,దేశం కోసం పోరాడిన పోరాడుతున్న వారిని సన్మానించుకుందాం రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఈరోజు లింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీద్ బండ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నియోజవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యశాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే,ఇంఛార్జి రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దేశభక్తిని ప్రజల్లో పెంపొందించేందుకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేయడం ఎంతో ప్రతిష్టాత్మకమని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో భారతదేశంపై గౌరవం పెరిగేలా చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు అన్ని డివిజన్లలో బూత్ స్థాయిలో తిరంగ యాత్ర విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూఆగస్టు 10 నుండి 15 వరకుహర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జాతీయోత్సాహంతో నిర్వహించాలని కార్యకర్తలకు సూచిస్తూ తాను స్వయంగా కూడా పతాకాన్ని ఎగురవేస్తానని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో నియోజవర్గ సీనియర్ నాయకులు జిల్లా,రాష్ట్ర, డివిజన్ అధ్యక్షులు, మహిళా మోర్చా,యువ మోర్చా మొదలగు వారు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**–ఈ వారం అన్న క్యాంటీన్ దాత జగ్గంపేటకు చెందిన కీర్తి శేషులు నేదురి శ్రీనివాస్ శాంతి దంపతులు జ్ఞాపకార్థం**





**– ప్రజా స్వేచ్ఛ**
**కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రతినిధి**

స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ,కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ కు జగ్గంపేట కు చెందిన కీర్తిశేషులు నేదూరి శ్రీనివాస్ శాంతి దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారులు వీరబాబు,సతీష్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్ కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై అన్నా క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు మారిశెట్టి భద్రం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం పేదవారి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు రద్దు చేయడంతో ప్రతిపక్షంలో ఉండి కూడా తెలుగుదేశం ఎక్కడికి అక్కడ టిడిపి నాయకులు కార్యకర్తల సహకారంతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని అందులో భాగంగా జగ్గంపేటలో కూడా గత నాలుగు సంవత్సరాలుగా అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని మా సోదరులు,టిడిపి నాయకులు స్వర్గీయ నేదూరి శ్రీనివాస్ శాంతి దంపతుల కుమారులు వీరబాబు,సతీష్ అన్నా క్యాంటీన్లో అన్నదానం ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్ వి ఎస్ అప్పలరాజు,మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు,టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు,మాధవరపు సూరిబాబు,వేములకొండ జోగారావు,దేగల సత్తిబాబు, సాంబతుల చంద్రశేఖర్, రెడ్డి సుబ్బారావు,పలివెల యేసు రాజు,పుర్రె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వైభోగుల కొండబాబు యాదవ్ పుట్టినరోజు వేడుకలు

**–ముఖ్యఅతిథిగా హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**




**– ప్రజా స్వేచ్ఛ**
**కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రతినిధి**

స్థానిక రావులమ్మ నగర్ లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి, జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ సంఘం మాజీ అధ్యక్షులు, వైభోగుల కొండబాబు యాదవ్ పుట్టినరోజు వేడుకలు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు,టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా కొండబాబు యాదవ్ మాట్లాడుతూ మా గురువు దైవం,మా ప్రియతమ నాయకులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో జన్మదిన వేడుక జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఈరోజు నాకు ప్రత్యక్షంగా,పరోక్షంగా, ఫోన్ ద్వారా,సోషల్ మీడియా ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు,అభివృద్ధి కమిటీ సభ్యులు మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు,టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు,మండల తెలుగు యువత అధ్యక్షులు రాయి సాయి,గండేపల్లి మండల టిడిపి బిసి సెల్ అధ్యక్షులు కారుకొండ శ్రీను,శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు మూరుకుర్తి శ్రీను,వేములకొండ జోగారావు,పిలా మహేష్, అల్లు అంజిబాబు, కోడూరి రమేష్,పాలు బాబు, ఈడిశెట్టి కొండ తదితరులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డీ మాజీ మంత్రి




**– ప్రజా స్వేచ్ఛ ఘనపూర్/వనపర్తి జిల్లా ప్రతినిధి**

ఖిల్లా ఘనపురం మండలం మామిడిమాడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ఆగారం కృష్ణారెడ్డి,నూతన గృహ ప్రవేశం కార్యక్రమానికి విచ్చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డీ వారి కుటుంబ సభ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి,మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య,రంగారెడ్డి గ్రామ అధ్యక్షుడు బండ్ల గోపాల్, శ్రీనివాస్ గౌడ్,జనార్ధన్, రవీందర్ చారి,బసవరాజ్, శేషు యాదవ్,పెద్ద ఆంజనేయులు గౌడ్, సురేందర్,చిన్న ఆంజనేయులు గౌడ్,రవీందర్ రెడ్డి,కుటుంబ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు

# తుమ్మల నరసయ్య సేవలు చిరస్మరణీయం

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి**



**– ప్రజా స్వేచ్ఛ   వలిగొండ ( ప్రతినిధి)**

వలిగొండ మాజీ ఎంపీపీ తుమ్మల నరసయ్య మండల ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి అన్నారు సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆరూరు నరసయ్యగూడెం గ్రామాలలో తుమ్మల నరసయ్య రెండవ వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అందరికీ సుపరిచితుడని. ప్రజల్లో తుమ్మల నరసయ్య చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టేడి జనార్ధన్ రెడ్డి తుమ్మల దామోదర్ తుమ్మల శ్రీనివాస్ తుమ్మల శ్రీధర్ మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సామ రాంరెడ్డి చెరుకు శివయ్య గౌడ్ బద్ధం సంజీవరెడ్డి జక్క జంగారెడ్డి మామిడి నరేందర్ రెడ్డి చిలుగురి సత్తిరెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైసొల్ల ప్రవీణ్ కుమార్ లింగయ్య యాదవ్ బండారు నరసింహారెడ్డి చిలకమర్రి కనకాచారి పులిపలుపుల రాములు గౌడ్ ఎస్ కె రసూల్ తుమ్మల నరసయ్య సేవాసమితి సభ్యులు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆగస్టు 13తో రైతు భీమా గడువు ముగింపు

**హుస్నాబాద్, – ప్రజా స్వేచ్ఛ**

2025 జూన్ 5వ తేదీ నాటికి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న 18-59 ఏళ్ల రైతులు రైతు భీమాకు అర్హులని రామవరం ఏఈవో శ్రీలత తెలిపారు. ఆధార్, పాస్‌బుక్, నామిని వివరాలతో ఆగస్టు 13లోగా దరఖాస్తు చేయాలని సూచించారు. మరణించిన రైతు కుటుంబానికి 5 లక్షల భీమా సొమ్ము అందేలా ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యం



**– ప్రజా స్వేచ్ఛ   ఘట్కేసర్ ప్రతినిధి ఆగస్టు 11**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడపా లత 45 తన కుమారుడు అడపా సందీప్ 28 వ్యాపారం, నిమిత్తం తన కుటుంబంతో హైదరాబాద్‌లోని మాదన్నపేటలో నివసిస్తున్నారు గత మూడు రోజుల క్రితం కుటుంబ కలహాల కారణంగా అతను తన భార్యతో గొడవపడి, తన మొబైల్ ను ఇంట్లోనే ఉంచి, ఇంటి నుండి వెళ్లిపోయాడు,ఆమె కుమారుడు ఘట్కేసర్‌లోని మైసమ్మ గుట్ట ప్రాంతంలో భారత్ పెట్రోల్ బంక్‌లో ఉన్నాడని ఆమెకు సమాచారం అందింది గత మూడు రోజుల క్రితం తన బంధువులు, స్నేహితులను విచారించి చుట్టుపక్కల ప్రాంతాలను వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు రంగు ప్యాంటు, ఎత్తు 6", రంగు తెలుపు ఫిర్యాదు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

# బిజినెస్

# పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్..

## లాభాల్లోకి మార్కెట్లు.


### సెన్సెక్స్ 746 పాయింట్లు జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఇటీవల మార్కెట్లు పతనమయ్యాయి. విదేశీ పెట్టుబడులతో మదుపరుల కాన్ఫిడెన్స్ పెరగడంతో మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఉదయం మార్కెట్లు ఫ్లాట్‌గా మొదలైనా ఆ తర్వాత లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 79,885.36 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 79,772.46 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 80,636.05 పాయింట్లకు చేరింది. చివరకు 746.29 పాయింట్ల లాభంతో 80,604.08 వద్ద స్థిరపడింది.నిఫ్టీ 221.75 పాయింట్లు పెరిగి 24,585.05 వద్ద ముగిసింది. దాదాపు 2,136 షేర్లు లాభపడగా.. 1,867 షేర్లు నష్టపోయాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా మోటార్స్, ఎటర్నల్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, అపోలో హాస్పిటల్స్, ట్రెంట్, ఎస్‌బీఐ, జియో ఫైనాన్షియల్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభాల్లో కొనసాగగా.. హీరో మోటోకార్ప్, భారత్ ఎలక్ట్రానిక్స్, భారతి ఎయిర్‌టెల్ నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.35 శాతం పెరిగాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు ఫార్మా, మెటల్, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ 0.5-2 శాతం పెరిగాయి.

## భారీగా పతనమైన ధరలు..

## హైదరాబాద్‌లో ధరలివే..!



పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్. బంగారం ధరలు ఇటీవల గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు దిగి వస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో స్టాకిస్టులు అమ్మకాలకు దిగుతున్నారు. ఐదురోజుల తర్వాత సోమవారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి పతనమయ్యాయి. 24 క్యారెట్ల బంగారంపై రూ.900 తగ్గి తులానికి రూ.1,02,520కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ ధర సైతం రూ.900 తగ్గడంతో తులానికి రూ.1,02,100కి చేరుకుంది. అయితే, బంగారం గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో బంగారం ధర రూ.5800 పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ తగ్గడంతో ధర దిగివస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతుండగా.. ట్రంప్ శాంతి ప్రయత్నాల నేపథ్యంలో చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారు. అలాస్కాలో కలిసేందుకు అంగీకరించడంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయని, దాంతో విలువైన ఆస్తులకు డిమాండ్ తగ్గినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గోల్డ్ బార్స్‌పై 39శాతం సుంకాలకు సంబంధించి వైట్‌హౌస్ స్పష్టతనివ్వడంతో ధరలపై ఒత్తిడి తెచ్చిందని తెలిపారు. సోమవారం వెండి ధర కిలోకు రూ.1000 తగ్గి రూ.1,14,000కి చేరుకుంది. వెండి సైతం గత ఐదురోజుల్లో కిలోకు రూ.2,500 పెరిగిన విషయం తెలిసిందే. న్యూయార్క్‌లో గోల్డ్ ఫ్యూచర్ ఔన్స్‌కు 40.61 డాలర్లు తగ్గి 3,358.17కి చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ కాంట్రాక్టుకు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు తగ్గి 1.26శాతం తగ్గి రూ.1,00,518 వద్ద ట్రేడవుతున్నది.కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపిన ప్రకారం.. బంగారం ఒకశాతానికి తగ్గింది. గతవారంలో ధరల పెరుగుదల లాభాలన్నింటిని తుడిచిపెట్టేశాయి. బంగారం ఉత్పత్తులపై సుంకాలపై వచ్చిన వార్తలన్నీ తప్పుడు సమాచారంగా ట్రంప్ పరిపాలన పేర్కొనగా.. మార్కెట్ వర్గాలన్నీ మరింత స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. స్పాట్ సిల్వర్ 1.39 శాతం తగ్గి ఔన్సుకు 37.81 డాలర్లకు చేరింది. ఏంజెల్ వన్‌లో వ్యవసాయేతర వస్తువులు, కరెన్సీల డీవీపీ పరిశోధన నిపుణుడు ప్రథమేష్ మాల్యా మాట్లాడుతూ సుంకాలు ప్రపంచవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించాయన్నారు.

## ఢిల్లీలో టెస్లా సెకెండ్ షోరూం ప్రారంభం

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూంను కూడా తెరిచింది. దేశ రాజధాని ఢిల్లీ లో తన సెకెండ్ షోరూంను సోమవారం అధికారికంగా ఓపెన్ చేసింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీ లో ఓపెన్ చేసింది.

**Y మోడల్ కార్ల అమ్మకాలు..**




ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. RWD (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ RWD వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే RWD వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది.

## ఫిట్‌నెస్‌పై పాండ్యా ఫోకస్..

## ఆసియా కప్ స్క్వాడ్‌లో ఉంటాడా..!



టీ20 వరల్డ్ కప్ హీరో హార్దిక్ పాండ్యా పునరాగమనానికి సిద్ధమవుతున్నాడు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఆసియా కప్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకునేందుకు ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాడు. యూఏఈ వేదికగా జరుగబోయే ఈ టోర్నీకి సమయం దగ్గరపడుతుండడంతో ఫిట్‌నెస్ టెస్టులో పాస్ అయ్యేందకు చెమటోడ్చుతున్నాడు పాండ్యా. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో పాండ్యా తన ఫిట్‌నెస్‌కు మెరుగులు దిద్దుకోనున్నాడు. ఆగస్టు 11, ఆగస్టు 12.. రెండు రోజులు ఎన్‌సీఏలోని బృందం ఈ పేస్ ఆల్‌రౌండర్ పరీక్షలు నిర్వహించింది. అన్ని టెస్టుల్లోనూ సత్తా చాటితే ఆసియా కప్ ఎంపికకు పాండ్యా అందుబాటులో ఉండే అవకాశముంది.టైమ్స్ ఆఫ్ ఇ ఇండియా కథనం ప్రకారం.. జూలై మధ్య నుంచే పాండ్యా ముంబైలో తన వర్కవుట్ రొటీన్‌ను షురూ చేశాడు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ పోస్ట్ ద్వారా అభిమానులకు హింట్ ఇచ్చాడీ స్టార్ ప్లేయర్. ఎన్‌సీఏలో చిన్న ట్రిప్ ఉంది అని ఆదివారం ఒక క్యాప్షన్ పెట్టిన పాండ్యా.. తన పునరాగమనంపై అప్డేట్ ఇచ్చాడు. నిరుడు పొట్టి ప్రపంచ కప్, ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో పాండ్యా కీలక పాత్ర పోషించాడు.టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఆసియా కప్ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా మొదలవ్వనున్న ఈ టోర్నీకి స్క్వాడ్ ఎంపిక భారత సెలెక్టర్లకు సవాల్‌గా మారింది. ఎందుకుంటే.. జూన్‌లో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్న సూర్యయాదవ్ యాదవ్ కోలుకునే దశలో ఉన్నాడు. ఈ మిస్టర్ 360 సైతం ఫిట్‌నెస్ కోసం ఎన్‌సీఏలో చేరాడు. మ్యాచ్ విన్నర్ అయిన పాండ్యా సైతం ఫిట్‌నెస్ చాటుకోవాల్సి ఉంది. ఇద్దరూ కీలక ఆటగాళ్లు కావడంతో.. త్వరగా ఫిట్‌నెస్ నిరూపించుకోవాలని యావత్ క్రీడాలోకం కోరుకుంటోంది.

## మహిళల వన్డే ప్రపంచకప్ ట్రోఫీ ఆవిష్కరణ..

## టోర్నీ ఎప్పటి నుంచంటే..!

మరో 50 రోజుల్లో భారత్ వేదికగా మహిళ వన్డే క్రికెట్ ప్రపంచకప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇవాళ ముంబై లో 'ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్-2025 ట్రోఫీని ఆవిష్కరించారు. భారత లెజెండ్ క్రికెటర్స్ యువరాజ్ సింగ్ , మిథాలీ రాజ్ తోపాటు ప్రస్తుత మహిళా క్రికెట్ స్టార్స్ హర్మన్ ప్రీత్ కౌర్ , స్మృతి మందాన, జెమీమా రోడ్రిగ్స్ , ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా ఈ ట్రోఫీ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఐసీసీ ఛైర్మన్ జై షా ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.'ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్-2025' ఇవాల్టి నుంచి సరిగ్గా 50 రోజుల్లో అంటే సెప్టెంబర్ 30న ప్రారంభం కానుంది. అయితే 2016 తర్వాత భారత్ మహిళల ఐసీసీ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. 2016లో భారత్‌లో మహిళల T20 క్రికెట్ ప్రపంచకప్ జరిగింది. అదేవిధంగా అంతకుముందు కూడా 1978, 1997, 2013లో భారత్ మహిళల క్రికెట్ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చింది.




# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ సిరీస్ కోసం

## షమీని సంప్రదించాం..

### అతడు ఏం అన్నాడంటే..?



అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీకి సీనియర్ పేసర్‌ను మహ్మద్ షమీ ని ఎంపిక చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ పరిస్థితులు బాగా తెలిసిన, బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల షమీ ఉంటే భారత్‌కు కలిసొచ్చేదని పలువురు వాపోతున్నారు. బుమ్రా మూడే టెస్టులు ఆడినందున సిరాజ్‌కు తోడుగా.. షమీ ఉండేవాడని అందరూ అభిప్రాయపడుతున్న వేళ బీసీసీఐ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంగ్లండ్ పర్యటనకు ఉద్దేశపూర్వకంగా షమీపై వేటు వేశారనే వార్తల్లో నిజం లేదని చెప్పింది భారత బోర్డు.'అందరూ అనుకుంటున్నట్టు ఇంగ్లండ్ పర్యట నకు షమీని పక్కనపెట్టేయలేదు. అనుభవజ్ఞుడైన అతడిని స్క్వాడ్ ఎంపిక చేయడానికి ముందు సెలెక్టర్లు సంప్రదించారు. ఫిట్‌నెస్ కారణంగానే షమీని తీసుకోలేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు అన్నారు. అంతేకాదు సెలెక్టర్లకు భారత పేసర్ ఏం చెప్పాడో కూడా తెలిపింది.'ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన షమీని కచ్చితంగా ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక చేయాలనుకున్నాం. సుదీర్ఘ అనుభవం గల అతడి సేవలు జట్టుకు అసవరమని అందరం భావించాం. కానీ, షమీ మాత్రం తాను ఫిట్‌గా ఉన్నాననిగానీ, పక్కాగా సిద్ధంగా ఉన్నాననిగానీ చెప్పలేదు. అతడు ఆత్మవిశ్వాసంగా లేకపోవడంతోనే సిరీస్‌కు ఎంపిక చేయలేదు' అని బీసీసీఐలోని అధికారి వెల్లడించారు.




# రూ.100 కోట్ల క్లబ్‌లో విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'

అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విషయాన్ని చిత్రబృందం ప్రకటించింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాకు నాగవంశీ నిర్మాతగ వ్యవహారించగా.. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటించింది. అయితే జూలై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. తాజాగా ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో గీతా గొవిందం(రూ.130 కోట్లు) తర్వాత రెండోసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన హీరోగా విజయ్ రికార్డును అందుకున్నాడు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. సూరి అన్న శివ (సత్యదేవ్). అనుకోని కారణాల వల్ల శివ చిన్నప్పుడే ఇల్లు వదిలి వెళ్లిపోతాడు. తన అన్న కోసం సూరి వెదుకుతూనే ఉంటాడు. ఓ సందర్భంలో సూరి తన పై అధికారిపై చేయి చేసుకుంటాడు. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు సూరికి ఓ మిషన్ అప్పగిస్తారు అధికారులు. అండర్ కవర్ ఏజెంట్‌గా మారి శ్రీలంకలో వున్న ఓ గ్యాంగ్‌ని అదుపులోకి తీసుకోవాలి. ఇదీ ఆ మిషన్. ఇలా చేస్తే సూరికి తన అన్నని కలిసే అవకాశం దొరుకుతుంది. ఈ మిషన్‌కి ఒప్పుకున్న సూరి శ్రీలంక పయనం అవుతాడు. తర్వాత ఏం జరిగింది? అసలు శివ లంకకి ఎందుకు వెళ్లాడు? అక్కడ ఎలాంటి పనులు చేస్తున్నాడు? అన్న కోసం వెళ్లిన సూరికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? ఇదంతా మిగతా కథ.



# రాశి సింగ్ రచ్చ మామూలుగా లేదుగా

రాశి సింగ్.. సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తుంది. నిత్యం లేటేస్ట్ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ వయ్యారి.. ఇప్పుడు తాజాగా షేర్ చేసిన ఫోటోస్ నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి.ఈ బ్యూటీకి ఇన్ స్టాలో ఓ రేంజ్ ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది. ఓ వైపు గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూనే.. మరో వైపు ట్రెడిషనల్ లుక్ లోనూ ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను కవ్విస్తుంది ఈ వయ్యారి భామ. సినిమాల్లో కాస్త పద్దతిగా కనిపించినా.. అటు ఇన్ స్టాలో మాత్రం గ్లామర్ ఫోజులతో రచ్చ చేస్తుంది. అయినా ఈ బ్యూటీకి టాలీవుడ్ ఇండస్ట్రీలో మాత్రం అవకాశాలు రావడం లేదు. సుహాస్ నటించిన ప్రసన్న వదనం సినిమాతో మెప్పించింది.ఈ మూవీతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీకి అవకాశాలు మాత్రం రావడం లేదు. అంతకు ముందు అరడజను చిత్రాల్లో నటించినప్పటికీ సరైన క్రేజ్ మాత్రం రావడం లేదు. సోషల్ మీడియాలో మాత్రం తన అందంతో కుర్రకారును విపరీతంగా కవ్విస్తుంది ఈ హాట్ బ్యూటీ. 2021లో ఆది సాయి కుమార్ నటించిన శశి సినిమాలో నటించింది. ఆ తర్వాత 2023 సంతోష్ శోభన్ నటించిన ప్రేమ్ కుమార్ మూవీలో మెరిసింది. పోస్టర్, జెమ్ చిత్రాల్లో నటించినప్పటికీ అంతగా ఫేమస్ కాలేదు. ప్రస్తుతం ఈ బ్యూటీ ఆఫర్స్ కోసం వెయిట్ చేస్తుంది.



# 42ఏళ్ల వయసులోనూ కుర్రహీరోయిన్స్ కు గట్టి పోటీ ఇస్తున్న శ్రియ..

తెలుగులో ఒకప్పుడు టాప్ హీరోయిన్స్ లిస్ట్ లో శ్రియ ఒకరు. మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, ఎన్టీఆర్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు సినిమాల్లో సహాయ నటిగా కొనసాగుతుంది.ప్రస్తుతం శ్రియా వయసు 42 సంవత్సరాలు. ఇప్పటికీ కుర్ర హీరోయిన్లకు పోటీగా ఏమాత్రం తరగని అందంతో మెస్మరైజ్ చేస్తోంది శ్రియా. ఈ క్రమంలోనే తాజాగా తన ఫిట్నెస్, డైట్ ప్లాన్ రివీల్ చేసింది ఈ ముద్దుగుమ్మ.ఇప్పటికీ కుర్ర హీరోయిన్స్ కుళ్ళుకునేలా ఉంది ఈ బ్యూటీ. ప్రతిరోజు కఠినమైన వ్యాయమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తానని తెలిపింది శ్రియా. అలాగే తన దినచర్యలో యోగా కచ్చితంగా ఉండాల్సిందే అని.. మానసిక ప్రశాంతత కోసం నిత్యం యోగాసనాలు చేస్తానని తెలిపింది ఈ వయ్యారి భామ. అలాగే స్విమ్మింగ్, డ్యాన్స్ ఎప్పుడూ తనను మానసిక ప్రశాంతంగా ఉండేలా చేస్తుందని చెప్పుకొచ్చింది. వ్యాయామం చేసే ముందు తినడం వల్ల తనకు తగినంత శక్తి వస్తుందని.. తేలికైనా ఆహారం తీసుకోవడానికి ఇష్టపడతానని చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ. బాదం స్థిరమైన శక్తిని, అరటిపండ్లు కార్బోహైడ్రేట్ బూస్ట్ అందిస్తాయని తెలిపింది. అలాగే బెర్రీలు, అవిసె గింజలతో చేసిన స్మూతీ, ఎక్కువగా నీరు తీసుకుంటానని తెలిపింది. ఇంట్లో తయారు చేసిన స్నాక్ తీసుకుంటానని చెప్పుకొచ్చింది.



# గ్లామర్ డోస్ పెంచేసిన హైదరాబాదీ బ్యూటీ..

## ఫరియా పిచ్చేక్కించిందిగా..!

టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ క్రేజ్ సొంతం చేసుకున్న హీరోయిన్లలో ఫరియా అబ్దుల్లా ఒకరు. ఫస్ట్ మూవీ నుంచే తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. కేవలం కామెడీ రోల్స్ మాత్రమే కాకుండా గ్లామర్ లుక్స్ లోనూ కట్టిపడేసిందిఈ వయ్యారి భామ. సోషల్ మీడియాలో నిత్యం క్రేజీ ఫోటోస్ షేర్ చేసే ఫరియా.. తాజాగా చీరలో గ్లామరస్ ఫోటోస్ పంచుకుంది. ట్రాన్స్ పరెంట్ స్టైలిష్ చీరలో ఫరియా వేసిన హావభావాలు అద్భుతంగా ఆకర్షిస్తున్నాయి. మత్స్యకన్య వైబ్స్ అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కు తగ్గట్టే.. ఆమె లుక్ మరింత అందంగా కనిపిస్తుంది.చీరతోపాటు స్లీవ్ లెస్ బ్లౌజ్, లాంగ్ హెయిర్, కాంతివంతమైన మేకప్ ఆమె లుక్ ను మరింత హైలెట్ చేస్తున్నాయి. కెమెరా ముందు సునాయాసంగా ఇచ్చిన ఫోజులు చూసి ఫ్యాషన్ ప్రేమికులు ఫిదా అవుతున్నారు. మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది ఫరియా.ఆ తర్వాత పలు సినిమాల్లో నటించినప్పటికీ ఆ స్థాయిలో హిట్స్ అందుకోలేకపోయింది. అయినా స్క్రీన్ ప్రెజన్స్, డ్యాన్సింగ్ స్కిల్స్ కామెడీ టైమింగ్ తో జనాల హృదయాలను గెలుచుకుంది. సినిమాలతోపాటు పలు ఓటీటీ ప్రాజెక్టులలోనూ మెరిసింది. ప్రస్తుతం గుర్రం పాపిరెడ్డి సినిమాలో నటిస్తుంది ఈ చిన్నది. అందం, అభినయంతో కట్టిపడేస్తోన్న ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు మాత్రం అంతగా రావడం లేదు. దీంతో నిత్యం గ్లామరస్ లుక్స్ తోపాటు ట్రెడిషనల్ డ్రెస్స్ లో కనిపిస్తుంది ఈ అమ్మడు. తాజాగా ఈ ముద్దుగుమ్మ లేటేస్ట్ ఫోటోస్ వైరలవుతున్నాయి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 .
Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492